క్లుప్తంగా

గణేశ్ మండపాల బాధ్యత నిర్వాహకులదే

అనపర్తి : వినాయక మండపాల బాధ్యత పూర్తిగా నిర్వాహకులదేనని రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య అన్నారు. గురువారం అనపర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వారి కార్యాలయం ఆవరణలో మండలంలోని వినాయక ఉత్సవ కమిటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి సందర్భంగా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఏ విధమైన అశ్లీలమైన ప్రోగ్రాములు పెట్టకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండగను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వీఎల్‌వీకే సుమంత్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

చవితి వేడుకలకు రాట ముహూర్తం

పెదపూడి: వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రభుత్వ నిబంధనలతో భక్తులు నిర్వహించుకోవాలని ప్రముఖ పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అన్నారు. ఈనెల 27న జరిగే వినాయక చవితి వేడుకలకు సంబంధించి సంపర గ్రామం జనార్దన కాలనీలో గురువారం పందిరిరాట మూహూర్తం గ్రామ నాయకులు, భక్తులు, భక్తిశ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, భక్తులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

రంగంపేట: దొడ్డిగుంట గ్రామంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు స్థానిక స్మైల్ ఫౌండేషన్ అధినేత కొండేపూడి ధనరాజ్ తెలిపారు. స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో బీపీ షుగర్, గుండెకు సంబంధించి ఈసీజీ, గ్యాస్టిక్, ఎముకలు, దంత, కంటి వైద్య పరీక్షలతోపాటు మహిళలకు సంబంధించిన వ్యాధులకు మహిళా డాక్టర్లతో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నారు.

55 పశువులకు వైద్య పరీక్షలు

బిక్కవోలు: గ్రామంలోని ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ తేతలి సుమ ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ శిబిరంలో మండపేట రాష్ట్ర పశు సంవర్ధక శిక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేష్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీపీ మనోజ్ కుమార్, మండపేట పశు వైద్యులు, రాజమహేంద్రవరం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాక్కాన వెంకటేశ్వరరావు, అనపర్తి ఏడీ డాక్టర్ వై.శ్రీనివాసరావు సేవలు అందించారు. 55 పశువులు గర్భకోశ వ్యాధి చికిత్సలు, గర్భనిర్ధారణ, ఇతరు వ్యాధులకు చికిత్సలు అందించారు. పాడి రైతులు ఖనిజ లవణ మిశ్రమం అందించారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

రాజానగరం: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో జరిగిన అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్టు ఎంపీడీఓ జెప ఝాన్సీ తెలిపారు. ఎస్ఆర్‌పీ సూర్యచక్రం ఆధ్వర్యంలో నియమించిన ప్రత్యేక బృందం ప్రస్తుతం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఈ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తుంది. ఈ పరిశీలన పూర్తయిన తరువాత రెండు రోజులలో మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి గ్రామాల వారీగా ఆడిట్ చేసి, ఫైనల్‌గా మండల స్థాయిలో ఆడిట్ చేస్తారన్నారు.

పింఛన్ల పంపిణీ విధులు నిలిపివేయాలి

సీతానగరం: అదనపు పని భారాన్ని పెంచుతూ పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి తమను నియమించొద్దంటూ మండల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీఓ ఎం.భారతికి గురువారం వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు యూనియన్ కోరుకొండ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి, మండల యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్ సువర్ణ కుమారి విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందిని పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి నియమించవద్దని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అభ్యర్థన పత్రాలను పంపించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు .

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజానగరం: బొమ్మూరు– ద్వారపూడి 33 కేవీ ఫీడర్‌పై మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి రూరల్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.నటరాజన్ గురువారం తెలిపారు. సంపత్‌నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, నామవరం, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

రంగంపేట: మండలంలో నల్లమిల్లి రోడ్డు అభివృద్ధి పనులు, మెయింటెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్తు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ జేపీబీ నటరాజన్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. రంగంపేట సబ్ స్టేషన్ 11కేవీ పరిధిలోని రంగంపేట టౌన్, ఇండస్ట్రియల్ ఫీడర్లు, చిన దొడ్డిగుంట, సుభద్రంపేట గ్రామాలకు, వడిశలేరు 11కేవీ పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రకృతి హితులు.. మట్టి ప్రతిమలు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణానికి హాని
- రసాయన రంగులతో వ్యాధులు సోకే ప్రమాదం
- మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని అధికారుల విజ్ఞప్తి



విద్యార్థులు చేసిన మట్టి గణపతి విగ్రహం



పందలపాకలో గత ఏడాది మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న యువకులు



కొంకుదురులో విద్యార్థులు చేసిన మట్టి గణపతి విగ్రహాలు

బిక్కవోలు: వినాయక చవితి వచ్చేస్తోంది. గ్రామాల్లో ఇళ్లల్లోనూ వీధివీధినా గణనాథులు కొలువుదీరి పూజలందుకోవడానికి సిద్ధమవుతున్నారు. యువత పంటపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అందరూ ఎంతో ఉత్సాహంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో వినాయక మంటపాల ఏర్పాటుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది అత్యధిక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో..

వచ్చే నెల 27న వినాయక చవితి సందర్భంగా అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లోని 58 గ్రామాల్లో ఏటా సుమారు 285 పైగా వినాయక పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవిగాక ప్రతి ఇంటా వినాయక ప్రతిమలతో పూజలు చేస్తారు. ఇలా ఏర్పాటయ్యే పందిళ్లలో అందం, ఆకర్షణ కోసం ఎక్కువగా రంగల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలను వినియోగించడానికే మక్కువ చూపుతారు. ఇది పర్యావరణానికి పెద్ద సమస్యగా మారుతోంది. ఉత్సవ నిర్వాహకులు వాస్తవ పరిస్థితులు పరిగణనలోకి తీసుకుని, పర్యావరణ హితంగా వేడుకలు నిర్వహిస్తే మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు పర్యావరణానికి రక్షించుకున్న వారమవుతామని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే ఏర్పాటు చేసుకుని ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే కొంత మంది పర్యావరణ ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయకులనే పూజించాలంటూ ప్రచారం చేస్తున్నారు.

మట్టితో లాభాలు

- సహజ సిద్ధంగా లభించే బంక మట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం మంచిది.
- ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయి.
- మట్టి వినాయక విగ్రహాలు నిమజ్జనంతో నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదు.
- సహజసిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసి రంగులను మట్టి బొమ్మలకు అది ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు.

రసాయనాలతో అనర్థాలు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసి విగ్రహాలు కాలువలు, నదుల్లో నిమజ్జనం చేసినా కరగవు, వీటితో తయారైన ప్రతిమలో జిప్సం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి.

- వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశం వ్యవస్థ దెబ్బతింటుంది. నీటిలో ఉంచే చేపలు, పీతాలు వంటి జలచరాలు వ్యాధులు బారిన పడి చనిపోతాయి.
- రసాయానాలు కలిసిన నీటి మూలంగా శరీరంలో నరాలపై ప్రభావం చూపి కేన్సర్ వ్యాధికి దారి తీస్తుంది.

చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయి. రసాయనిక రంగులు కలిసిన నీరు పంట పొలాల్లో చేరి దిగుబడులు తగ్గించడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.

ఏటా మట్టి ప్రతిమల పంపిణీ



చవితి సందర్భంగా యువత ఆధ్వర్యంలో ప్రతి ఏటా మట్టి గణపయ్య విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. వీటి వలన మా గ్రామంలోని కొంత వరకు అయినా పర్యావరణ కలుషితం కాకుండా చేయడం మా యువత లక్ష్యం. ఈ ఏడాది మా యువత ఆధ్వర్యంలో మరింత ఎక్కువగా విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాటు చేస్తున్నాం.

– గొలుగూరి నాగిరెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పందలపాక

మట్టి గణపతిని పూజించాలి



వినాయక చవితికి మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి. దీనిపై విద్యార్థులతో తోటి ఉపాధ్యాయులు, చుట్టు పక్కల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వాటి వల్ల కలిగే లాభాలును వివరిస్తున్నా.

– వైటీఎస్ ఆచార్యులు, ఉపాధ్యాయుడు అనపర్తి

చిన్న విగ్రహాలే మంచిది



రసాయనిక రంగులతో పెద్ద విగ్రహాలు కంటే మట్టితో చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయడం వలన అటు ప్రమాదాలు, పర్యావరణ ఎంతో మేలు జరుగుతుంది. చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల నిమజ్జన సమయం ప్రమాదాలు నివారించవచ్చు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి.

– వాసంశెట్టి రవి చంద్ర కుమార్, ఎస్సై బిక్కవోలు

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

పెదపూడి: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లలకు తక్షణం వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు, మండల అంగన్‌వాడీ వర్కర్ల అసోసియేషన్ నాయకురాలు ఎం.రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదపూడి మండల రెవెన్యూ, కాకినాడ పైన ఆర్అండ్‌బీ రోడ్డులో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నల్ల దుస్తులు ధరించి నిరసన కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం చేపట్టారు. అంగన్‌వాడీల డిమాండ్లను నేరవేర్చాలన్నారు. తమ సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పీవీ సీతాపతిరావుకు వినతిపత్రం అందజేశారు.

రాజానగరం: కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, అర్హత ఉన్న వారికి సూపర్‌వైజర్లుగా పదోన్నతినివ్వాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు తమను అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రాజానగరంలో గురువారం ఆందోళన చేశారు. నల్ల చీరలు ధరించి స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి ర్యాలీగా గ్రామంలోని సాయిబాబా గుడి సెంటరుకు చేరుకున్నారు. అనంతరం అక్కడ రోడ్డుపై మానవహారంగా ఏర్పడి, నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల యూనియన్ ప్రతినిధులు ఎం.మార్తమ్మ, పి.సుబ్బలక్ష్మిలు నాయకత్వం వహించారు.

సీతానగరం: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పెర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం సీతానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్ సువర్ణ కుమారి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ కోరుకొండ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి, మండల అధ్యక్షురాలు సువర్ణ, మండలంలోని అంగన్వాడీ వర్కర్లు పాల్గొని మాట్లాడారు.

అనపర్తి: అంగన్‌వాడీల నిర్వహణ కోసం ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయడం లేదని దీర్ఘకాలంగా వేతనాలు పెంచడం లేదని తదితర కారణాలతో అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం అనపర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది భారీగా చేరుకుని తమ సమస్యలకు అధికారులకు తెలియచేశారు. అనంతరం తహసీల్దార్ అనిల్‌కు వినతిపత్రం అందచేశారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న విజయ సారథి

రంగంపేట: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు విజయ సారథి ఎద్దేవా చేశారు. గురువారం వెంకటాపురం గ్రామంలో మండల క్రైస్తవ నాయకుడు కె.స్వర్ణైన్ రాజు స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఒక్క కొత్త పథకం కూడా ప్రవేశపెట్టలేదన్నారు. రెండు సంవత్సరాల కాలం నుంచి ×కాపీ కొట్టు డప్పు కొట్టు అనే పద్ధతిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని కాపీ కొట్టి పేరు మార్చి దాన్ని ప్రజలకు ఏదో మేలు చేస్తున్నట్టుగా చెప్పడం వంటి కార్యక్రమాలు చేస్తోంది తప్ప ప్రజలకు మేలు చేయడంలేదన్నారు. జగనన్న హయంలో ఉన్న 17 మెడికల్ కాలేజీలు అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తూ వాటిని అభివృద్ధి చేయలేమని చేతులెత్తేసి ఈ రోజున ప్రైవేటీకరణకు సిద్ధమవుతోందన్నారు. పథకాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి త్వరలోనే రాష్ట్రంలోని క్రైస్తవులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు అందరితో కలిసి బహిరంగ సభ ఏర్పాటు కృషి చేస్తున్నామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు ఆదా



ఆరికరేవులలో బయోదార్ తయారు చేస్తున్న ప్రకృతి సిబ్బంది

బిక్కవోలు: ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని డీపీఎం తాతారావు అన్నారు. గురువారం మెల్లూరు, ఆరికరేవులు గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించారు. మెల్లూరు యూనిట్ ఇన్‌చార్జి మాధరి, ఆరికరేవుల ఐసీఆర్‌పీ మలేశ్వరి, లావణ్య, సత్యశ్రీలు బయోదార్ తయారు చేసి విధానం ఉపయోగాలు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా డీపీఎం తాతారావు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి సేద్యం ద్వారా పంటలు పండించి తక్కువ ఖర్చుతో మంచి దిగుబడి పొందవచ్చున్నారు. ఆరుతడి పద్ధతి ద్వారా నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయశాఖ ఏవో శామ్యూల్, జాన్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ శ్రీను, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెదపూడిలో 'పొలంబడి'

పెదపూడి: గ్రామంలో ఏఓ సత్యప్రసాద్ గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. ఎరువుల వినియోగంపై ఏ రకమైన ఎరువులు మిశ్రమంగా కలపవచ్చు అనే దానిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మండల విస్తరణ అధికారి శ్రీనివాసు గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఇంట్రామోరల్ క్రీడలు ప్రారంభం



పందలపాకలో టాస్ వేసి పోటీలు ప్రారంభిస్తున్న సత్తిరాజు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీపడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025–26 సంవత్సరానికి ప్రారంభ ఇంట్రామోరల్ క్రీడ పోటీలు ప్రారంభించారు. గురువారం పాఠశాల వద్ద ముందుగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తి రాజు కబడ్డీ క్రీడలు టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాల ప్రారంభ సమయంలో విద్యార్థులను హౌస్‌లుగా విభజించి గ్రూపుల మధ్య ఇంట్రామోరల్ క్రీడలు కబడ్డీ, వాలీబాల్, కోకో, చదరంగం , అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ నెల 29 క్రీడా దినోత్సవం రోజున ఇంట్రామోరల్స్ విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ ప్రభుత్వంలో ప్రొటోకాల్ పాటించరా!

మాజీ శాసన సభ్యుడు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి



అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రొటోకాల్ అంశాలలోని చిన్నచిన్న లోపాలను సాకుగా చూపుతూ గత ఏడాదిన్నర కాలంగా తనపై, తన కుటుంబ సభ్యులపై దుష్ప్రచారానికి పాల్పడుతున్న బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన స్వగ్రామం రామవరంలో జరుగుతున్న ప్రొటోకాల్ ఉల్లంఘన, ఇబ్బందికరమైన పనులపై సమాధానం చెప్పాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గ వ్యాప్తంగా శిలాఫలకాలు, ముఖ ద్వారాలను ధ్వంసం చేయడం, తనకు చెందిన పార్టీల రంగులలోకి మార్చి స్వయం తృప్తి పొందడం, నింబధనల సాకుతో శిలాఫలకాలు సవరణలు చేయడం సరికాదన్నారు. అలాగే రామవరం ప్రభుత్వ ఆస్పత్రికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి బంధువుల పేరు పెట్టడంలోను దేవుడిమాన్యం కాలనీకి పేరు పెట్టడంలోను ఏ నిబంధనలు పాటించారో ప్రజలకు కచ్చితంగా చెప్పాలన్నారు. రామవరం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.2 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసిందని, పూర్తిగా ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆస్పత్రికి ఎమ్మెల్యే బంధువులు పేరు ఎలా పెట్టారో చెప్పాలన్నారు. గురువారం వారి బంధువులను మీడియాతో సహా తన నర్సింగ్ హోం పైకి పంపించారని, వచ్చిన వారికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి మధ్య జరిగిన వాగ్వాదంలో వచ్చిన వారు స్పష్టంగా 50 శాతం నిధులు కోటి రూపాయలు చెల్లించలేదని, అయినా ఆసుపత్రి భవనానికి తమ తల్లిదండ్రుల పేర్లు పెట్టించుకున్నామని వారే స్పష్టం చేశారని దీనికి వారి వెంట వచ్చిన మీడియా వారే సాక్ష్యమని మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అంటే ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చెప్పే నీతులు ఎదుటి వారికే గానీ తనకు వర్తించవని అధికారం ఉంది కదా అని అసత్యాలు మాట్లాడితే సహించమని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌సీ భవనం పై కంట్రిబ్యూషన్ కట్టకుండా ప్రైవేటు వ్యక్తుల పేరు వేయడం తగదని పేరు వేయించుకున్న వారు యాభై శాతం కట్టి ఉంటే ఆ విరాళం సొమ్ము ఏమైపోయిందో ఎమ్మెల్యే సమాధానం ఇవ్వాలని లేకుంటే ఆ పేరు పై అధికారులు చర్యలు తీసుకోవాలని డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు.

విద్యా ప్రమాణాలు మరింత పెంచాలి

డీఈఓ పిల్లి రమేష్



సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న డీఈఓ రమేష్ తదితరులు

పెదపూడి: పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ అన్నారు. సంపరలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించి, పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో పలు ప్రశ్నలు అడిగి వారిలో విద్యా ప్రమాణాలు ఏ మేరకు ఉన్నాయో పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మండల విద్యాశాఖ అధికారి–1 కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

బోగస్ పేరుతో అర్హులకు అన్యాయం

రాజానగరం: ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్లలో ఉన్న బోగస్ పింఛన్లను ఏరివేత నెపంతో అర్హులకు తీరని అన్యాయం చేస్తున్నారని కొత్తతుంగపాడుకు చెందిన జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ బోగస్ పింఛన్ల పరిశీలనలో వాస్తవాలు పూర్తిగా పరిశీలించాలన్నారు. మండలంలో జరుగుతున్న ఏరివేతలో చాలా మందికి దివ్యాంగులు పింఛను తీసివేశారని, వీటిపై పునఃపరిశీలన చేయాలని అధికారులను కోరారు. అందుకు సంబంధించి కొంతమంది పేర్లను ఉదాహరణలుగా పేర్కొన్నారు.

నిరక్షరాస్యులను గుర్తించండి

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశానికి స్థానిక ఎంపీడీఓ ఎం భారతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దడానికి ప్రభుత్వం ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సులో చదువురాని వారిని గుర్తించి, పది మందికి ఒక వలంటీర్ కేటాయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చేనెల నుంచి ప్రారంభమవుతుందన్నారు. మండలంలో 3,400 మందికి శిక్షణ ఇవ్వవలసిన అవసరం ఉందని ఎంపీడీఓ భబూరతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, ఏఓ సుబ్రహ్మణ్యం, మిర్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎమ్ జేఎస్ఎస్ శ్రీనివాస్, ఏపీఎమ్ జిలాని, ఎన్ఆర్ఈజీఎస్ టీఎలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

కాకినాడ జిల్లా జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు



కరకుదురులో చెత్త సేకరణపై అధికారులు, క్లాప్ మిత్రలతో మాట్లాడుతున్న సీఈఓ లక్ష్మణరావు

పెదపూడి: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని కాకినాడ జిల్లా జెడ్పీ సీఈఓ పి.లక్ష్మణరావు అన్నారు. కరకుదురు గ్రామ పంచాయతీలో ఆయన ఆకస్మికంగా పారిశుధ్య పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రాలు ఏ విధంగా తడి, పొడి చెత్త సేకరిస్తున్నారో ఆరా తీశారు. ప్రజలు ఏవిధంగా తడి, పొడి చెత్తను భద్రపరిచి క్లాప్ మిత్రాలకు ఇస్తున్నారో ప్రజలతో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఈఓ లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు మరిన్ని చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. తడి, పొడి చెత్త క్లాప్ మిత్రలకు అందించే విధానంపై ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి శానిటేషన్ క్లాప్ మిత్రులను తీసుకుని తడి, పొడిచెత్త విడివిడిగా ఇచ్చుటకు గృహిణీలతో ఐఈసీ యాక్టివిటీ చేస్తుండగా ఆ యాక్టివిటీని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, పెద్దాడ సాగుటీనీ డీసీ చైర్మన్ సానా శ్రీనువాసు, పాటంశెట్టి కాశీరాణి, సచివాలయం కార్యదర్శి సూర్యలక్ష్మి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు

రంగంపేట: విద్యారంగంలో సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్ఎఫ్ఐ కమిటీ గురువారం కళాశాలలో చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు జి.దివ్య, టి.పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలపై ఈనెల 25న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి విద్యార్థి లోకం ఉద్యమించి, చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రంగంపేటలో డిగ్రీ కళాశాలగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు హేమకిరణ్, మణికంఠ, రాజా, సాయి వెంకట్, కావ్య, చక్రవేణి పాల్గొన్నారు.

రంగంపేట ఎక్సైజ్ స్టేషన్ సందర్శన



రంగంపేట ఎక్సైజ్ స్టేషన్ వద్ద బైకల వేలంను పర్యవేక్షిస్తున్న నాగ రాహుల్

రంగంపేట: గ్రామంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ నాగరాహుల్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ స్టేషన్ వద్ద వివిధ కేసుల్లో స్వాధీన పరచుకున్న మూడు ద్విచక్రవాహనాల వేలం ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం జూన్‌లో వివిధ దాడులలో స్వాధీనం చేసుకున్న సారా, మద్యం బాటిళ్లను ధ్వంసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ

రాజానగరం: దివాన్‌చెరువులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను గురువారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకర వెంకటేశ్వర్రావు తన సోదరుడు నాగేశ్వర్రావు జ్ఞాపకారంగా రూ.10 వేలతో వీటిని తయారు చేయించి, విద్యార్థులకు అందజేశారని హెచ్ఎం శర్మ, స్కూల్ కమిటీ చైర్మన్ బెజవాడ శ్రీను తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.